క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జియారత్



ఉయ్యాలవాడలో దస్తగిరి, మౌలాలి పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలో దస్తగిరి, మౌలాలి పీర్ల జియారత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జార్తలు శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమై, శనివారం సాయంత్రం ముగిశాయి. జార్తల సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏటా మొహర్రం అనంతరం 20 రోజుల తరువాత జియారత్ నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు పీర్లకు పూల సూచకాలు, దట్టీలు, వెండిగొడుగులు, నగదు, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'వయ్యారిభామ'ను నివారిద్దాం

నంద్యాల(సెంట్రల్): పంట పొలాలతో పాటు మానవులపై దుష్ప్రభావం చూపే వయ్యారి భామ కలుపు మొక్క నివారణను సామాజిక బాధ్యతగా భావించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) సహ సంచాలకులు ఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పరిశోధనా స్థానంలో వయ్యారిభామ కలుపు నివారణ వారోత్సవాల్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...నక్షత్ర గడ్డిగానూ వ్యవహరించే ఈ కలుపు మొక్క వ్యాప్తి, ఉద్భృతి, నివారణ, దుష్ప్రభావాలపై రైతన్నలతో పాటు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. శాస్త్రవేత్తలు ప్రభాకర్, మంజునాథ్ వయ్యారిభామ మొక్క లక్షణాలు, పంటల దిగుబడి తగ్గే తీరు, మనుషులు, జంతువులపై విష ప్రభావంపై విపులీకరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పదోన్నతి పొందిన సీఐలు



ఎస్పీని కలిసిన సీఐ సూర్యమౌళి

బొమ్మలసత్రం: ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న సూర్యమౌళి, మస్తాన్‌కు సీఐలుగా ప్రభుత్వం ప్రమోషన్ కల్పించింది. ఈమేరకు డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పనిచేసిన సూర్యమౌళి సీఐగా నంద్యాల పట్టణానికి బదిలీ అయ్యారు. అలాగే కర్నూలు జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్ఐగా పనిచేసిన మస్తాన్ నంద్యాల జిల్లాకు సీఐగా బదిలీ అయ్యారు. వీరు శనివారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



గంగారం యశ్విత

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన గంగారం శేఖర్, వెంకటసుబ్బమ్మ దంపతుల కూమార్తె గంగారం యశ్విత రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. జూలై 12న గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలెక్షన్స్‌లో ప్రతిభ చూపడంతో కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతిలో ప్రవేశం పొందనుంది. ప్రస్తుతం యశ్విత స్థానిక ఎంపీపీ(బీసీ) స్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతోంది. బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

వాసుకు లయన్స్‌క్లబ్ పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్, కళారాధన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ఫొటోగ్రాఫర్ చింతలపల్లె వాసుకు లయన్స్‌క్లబ్ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కారాన్ని శనివారం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, సభ్యులు చంద్రమోహన్, నాగరాజు, మామిళ్ల నాగరాజు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఎరువులు అమ్మితే చర్యలు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని ఏఓ ప్రసాదరావు హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్లు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. మండలంలోని కొత్తపల్లె అరుణా ఆగ్రో ఏజెన్సీస్, పులిమద్ది జీఎం క్రాప్‌కేర్, శ్రీలక్ష్మి గణేష్ ఆగ్రో కెమికల్స్, పోలూరులోని ప్యాక్స్, జేసీరెడ్డి ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ పంట నమోదులో వాస్తవ కౌలు దారులను మాత్రమే వీఏఏలు నమోదు చేయాలని ఏఓ ప్రసాదరావు ఆదేశించా. మండలంలోని రాయమాల్పురం, పోలూరు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 7,665 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 1,251 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, మిరప, మినుము పంటలు సాగయ్యాయని చెప్పారు.





పేరూరులో గెలుపొందిన అభ్యర్థితో వైఎస్సార్‌సీపీ నాయకులు, వనికినిదిన్నెలో గెలుపొందిన అభ్యర్థితో నాయకులు, డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న బ్రాహ్మణపల్లె గ్రామ 5వ వార్డు విజేత ఆవుల ఓబులేసు

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు బ్రహ్మరథం

- కోటకందుకూరు సర్పంచ్‌గా నల్లజల లక్ష్మీదేవి ఘన విజయం
- నియోజకవర్గంలో ఆరు వార్డులు క్లీన్ స్వీప్

ఆళ్లగడ్డ: గుండెల్లో దాగిఉన్న అభిమానాన్ని పల్లె ఓటర్లు ఒక్కసారిగా కుమ్మరించారు. కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తుండటం, ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై గ్రామీణ ఓటర్లు మరోసారి అభిమానం చూపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఒక సర్పంచ్, ఆరు వార్డు మెంబర్లకు జరిగిన ఉప ఎన్నికల బరిలో నిలిచిన వైఎస్సార్‌సీపీ మద్దతు దారులకు ఘన విజయం కట్టబెట్టారు.

కోటకందుకూరు సర్పంచ్‌గా లక్ష్మీదేవి

కోటకందుకూరు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికల్లో శనివారం వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి నల్లజల లక్ష్మీదేవి 402 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించింది. మొత్తం 3,240 ఓట్లకు గాను 2,620 ఓట్లు పోలయ్యాయి. ఇందులో లక్ష్మీదేవికి 1,243 ఓట్లు రాగా టీడీపీ బలపరిచిన నాగశ్రీనువాసులుకు 841 ఓట్లు, స్వతంతంగా పోటీచేసిన సుంగల రియాజ్‌కు 460, నల్లగట్ల ఇంద్రసేనారెడ్డికి 24 ఓట్లు వచ్చాయి.

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి

అధికార పార్టీపై అసమ్మతి ఉందని చూపించాలని మాజీ మంత్రి అఖిలప్రియ వేసిన ఎత్తులు చిత్తయ్యాయి. నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఒక వార్డు మెంబర్ కూడా దక్కించుకోక లేక పోయారు. కోటకందుకూరు సర్పంచ్‌కు 402 మెజార్టీ రావడంతో పాటు లింగందిన్నె వార్డుకు జరిగిన ఎన్నికలో కేవలం 5 ఓట్లే రావడంతో టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. కోటకందుకూరులో తమకు పట్టుందని ఎలాగైనా మెజార్టీ సాధించాలని భర్త భార్గవరామ్, తమ్ముడు జగత్‌విఖ్యాత్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి భారీగా ఖర్చు చేసినప్పటికీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి విజయదుందుభి మోగించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలో జరిగిన వార్డు సభ్యుడి ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉసేన్‌బాషా 32 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. మొత్తం 82 ఓట్లు పోలవగా..57ఓట్లు ఉసేన్ బాషాకు రాగా.. టీడీపీ మద్దతుదారుడు శ్రీనివాసులుకు 25 ఓట్లు పోలయ్యాయి. దీంతో వార్డు సభ్యుడు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏపీ నీటిపారుదల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాముడు, చిన్నవుశేని, శ్రీనివాసులు, రాజా హుసేన్, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జునాపురంలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

కోటకందుకూరు సర్పంచ్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇలా..

రౌండ్	లక్ష్మీదేవి	శ్రీనివాసులు	రియాజ్	ఇంద్రసేనారెడ్డి	వైఎస్సార్‌సీపీ మెజార్టీ
1	308	199	113	04	109
2	288	194	145	18	94
3	323	209	106	1	114
4	324	239	96	1	85
	1,243	841	460	24	402

పేరూరులో..

రుద్రవరం: మండలంలోని పేరూరు 5వ వార్డు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలచిన లక్ష్మీదేవి 23 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వార్డులో మొత్తం 171 ఓట్లు ఉండగా శనివారం జరిగిన పోలింగ్‌లో 143 ఓట్లు పోలయ్యాయి. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుకు 82,టీడీపీ మద్దతుదారు రాలుకు 59 ఓట్లు వచ్చా యి. రెండు ఓట్లు చెల్లకుండపోయాయి. లెక్కింపు ప్రక్రియ పూర్తికాగానే గెలిపొందిన అభ్యర్థికి ఎన్నిల అధికారి కోటయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి డిక్లరేషన్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, బాల నాగిరెడ్డి, సర్పంచ్ కోనేటి దేవదానం సంబరాలు చేసుకోవడంతో పాటు అభినందనలు తెలిపారు.

శిరివెళ్ల: మండలంలో శనివారం రెండు గ్రామ పంచాయతీల రెండు వార్డు మెంబర్ల స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ 8 వార్డు, వనికినిదిన్నె 5 వార్డుకు ఉప ఎన్నికలు జరిగాయి.ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులుదీరారు.ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయంసాధించారు.యర్రగుంట్లలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు గుత్తి బాలరంగయ్య తన సమీప ప్రత్యర్థి టీడీపీ మద్దతుదారుడు వెంకట సుబ్బయ్యపై 53 ఓట్ల అధిక్యంతో విజయం సాధించాడు. వనికిదినిదిన్నెలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సుశీలమ్మ, టీడీపీ మద్దతుదారు కుమారిపై 27ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. విజేతలను సర్పంచులు సుభహాన్, సుబ్బలక్ష్మమ్మ, ఉప సర్పంచులు ప్రతాపరెడ్డి, సాయికుమార్, నాయకులు మేర్వ చిన్న నాగిరెడ్డి, సత్తార్ పూలరామిరెడ్డి, శంకర్,ఎంపీటీసీ నసీమూన్ సలాం, నరసింహ్మడు ,వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు అభినందించారు.

చాగలమర్రి: మండలంలోని బ్రాహ్మణపలె గ్రామ పంచాయతీలోని 5వ వార్డు స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఆవుల ఓబులేసు సమీప ప్రత్యర్థి స్వర్ణలతపై 59 ఓట్ల మెజారీతో గెలుపొందాడని పోలింగ్ అధికారి రామచంద్రయ్య తెలిపారు. 77 ఓట్లు ఉన్న ఈ వార్డులో 61ఓట్లు పోల్ కాగా..స్వర్ణలతకు 1 ఓటు రాగా, మరో 1 ఓటు నోటాకు, మిగిలిన 60 ఓట్లు ఆవుల ఓబులేసుకు పోలయ్యాయి. దీంతో ఓబులేసుకు 59 ఓట్ల మెజార్టీ లభించింది. అలాగే.. రాంపల్లె గ్రామంలోని 3వ వార్డు ఎన్నికలో దుదేకుల దస్తగిరమ్మ ఏకగ్రీవంగా గెలుపొందింది. మండలంలో రెండు వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సొంతం చేసుకున్నారు. ఎస్ఐ రమణయ్య పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, కౌంటింగ్ పూర్తయ్యే వరకు పర్యవేక్షించారు. విజేతలను వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి అభినందించారు.

గోస్పాడు: రాయపాడు గ్రామ పంచాయతీలోని 2వ వార్డు మెంబరుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు రామతులశమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. వార్డు మెంబరు శివారెడ్డి మృతితో ఉపఎన్నికల అనివార్యమైంది. అయితే రామతులశమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంఈఓ అబ్దుల్ కరీం ప్రమాణస్వీకారం చేయించి ధ్రువ పత్రాన్ని అందజేశారు.



రాయపాడులో రామతులశమ్మకు ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి



కోటకందుకూరులో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది



కోటకందుకూరులో బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య,సీఐలు

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండామాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు ఉదయాన్నే నిత్యపూజలు గావించిన అనంతరం పట్టువస్త్రాలు పూలమాలలతో ప్రత్యేకంగా ఆలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

117 జీవోను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): 117 జీవోను ఉపసంహరించుకుని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం నంద్యాల డీఈఓ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యాప్టో కార్యదర్శి సుబ్బన్న, చంద్రశేఖర్, శ్రీనివాసులు, బత్తుల రవికుమార్ మాట్లాడుతూ జూన్ నెలలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలనీ, సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని కోరారు. గోపాలకృష్ణ, నరసింహరావు, రాజ్‌కుమార్, నౌమాన్, బాషా పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రెసిడెంట్ మెడల్ విన్నర్ సతీష్ లాల్ పాల్గొన్నారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుతు లు అందజేశారు. అనంతరం సతీష్‌లాల్‌ను సన్మానించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండలంలోని మాచినేనిపల్లెకు చెందిన ఓబులేసు అనే వ్యక్తి శనివారం పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురై పురుగు మందుతాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం


నంద్యాల(సెంట్రల్): నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. జీవాల పెంపకంలో శాస్త్రీయ మెలకువలపై పాడి రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందికి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎల్ఎం ద్వారా గొర్రెలు, మేకల పెంపకానికి రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జేఎల్‌జీ గ్రూపులు, స్వయం సహాయక సంఘాలకు ఎన్ఎల్ఎం రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. గొర్రెలు, మేకల పెంపకానికి అవసరమైన భూమి, మేతకు సంబంధించి పచ్చిక బయళ్ల తదితరాలకు సంబంధించిన దస్త్రాలు ఉండాలన్నారు. గొర్రెల పెంపకంలో అనుభవం ఉన్నట్లు స్థానిక పశువైద్యుల నుంచి ధ్రువపత్రం ఉండాలని, 100 నుంచి 500 వరకు జీవాలను 5 యూనిట్లుగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పథకాన్ని 2025 వరకు అమలు చేస్తారని, ఎన్ని సంఘాలకైనా రుణ పరిమితి లభిస్తుందని వివరించారు. జీవాల పెంపకంలో అధునాతన సాంకేతిక యాజమాన్య పద్ధతుల గురించి ప్యాపిలి ఎస్‌టీసీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, స్రవంతి వివరించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఉప సంచాలకులు వరప్రసాద్, జిల్లాలోని పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కర్నూలు డీఎల్‌డీఏ వెటర్నరీ సర్జన్ రాజశేఖర్ రెడ్డి

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆలయ నిర్వాహకులు దండెదస్తగిరి ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తుపూజ, నవగ్రహ పూజ, ప్రధాన హోమం, గ్రామోత్సవం, జలాది వాసం , ధాన్యం, పుష్పాదివాసం, సయ్యాదివాసం, మూల జప హోమాలు, దర్శనం వంటి కార్యక్రమాలు చేపట్టగా శనివారం విగ్రహాలను ప్రతిష్ఠించారు.



యంత్ర ప్రతిష్ఠ హోమంలో పాల్గొన్న భక్తులు



రుద్రవరం వద్ద తెలుగుగంగ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు



అప్పనపల్లె వద్ద మొక్కజొన్న పంటకు నీటిని మళ్లించుకుంటున్న రైతు

పొలం చేరిన 'గంగ'

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల రైతులకు తెలుగుగంగ ప్రధాన, ఉపప్రధాన కాలువల ద్వారా సాగునీరు శనివారం అందుబాటులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రభుత్వం తెలుగుగంగ కాలువలకు సాగునీటిని విడుదల చేసింది. ఆ నీరు సాయంత్రానికి గండ్లేరు రిజర్వాయర్‌కు చేరింది. ప్రధాన కాలువలో నీరు పారడంతో అధికారులు ఉప ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేశారు. 16, 17, 18, 19, 20, 21 బ్లాకుల కాలువలకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని యాల్లావత్తుల, శ్రీరంగాపురం, డి.కొట్టాల, పెద్దకంబలూరు, అప్పనపల్లె, రుద్రవరం, తదితర గ్రామాలకు చెందిన రైతులు పంటలకు నీటిని మళ్లించుకుంటున్నారు. వర్షాలు లేక ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వాడుతున్న సమయంలో తెలుగుగంగ కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

నంద్యాల(న్యూటౌన్): పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన లీడర్స్ మోడల్ స్కూల్ విద్యార్థి బంగారు పతకం సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ రవిరాకేష్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి మధుతేజ సబ్ జూనియర్స్ 75 కేజీల విభాగంలో బంగారు పతకంతో పాటు బెంచ్ ప్రెస్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. మధుతేజను పాఠశాల ప్రిన్సిపాల్ దీపాలి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నిందితులను శిక్షించాలి

నంద్యాల(అర్బన్): విద్యార్థిని సుగాలి ప్రీతిబాయి కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ మాదిగ కోరారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ప్రీతిబాయి 6వ సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప, అధ్యాపకులు, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించండి

నంద్యాలటౌన్: కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, అలాగే రక్తహీనతకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని ఆశా శిక్షకురాలు ప్రతిభ తెలిపారు. స్థానిక కార్యాలయంలో నూతనంగా నియమించబడిన ఆశా కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. అనంతరం దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు.

దోమల నివారణతో ఆరోగ్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ, జిల్లా మలేరియా అధికారి

నంద్యాలటౌన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, దోమలను నివారించుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 20వ తేదీన దోమల వ్యాప్తి, నివారణ గురించి అవగాహన కలిగించడానికి ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

దోమ తెరలు వాడండి..

దోమ కాటుకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లో బాలికలకు దోమల వల్ల వ్యాపించే వ్యాధులు, నివారణ గురంచి వివరించారు. ఆయన మాట్లాడుతూ దోమతెరలు ఉపయోగిస్తే దోమ కాటుకు గురి కాకుండా ఉండవచ్చన్నారు.

సంఘాల ఏర్పాటుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ మోహన్‌రావు

రుద్రవరం: రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు రుద్రవరం, శిరివెళ్ల మండలాల ఆర్బీకేల సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని చిన్నకంబలూరు మెట్టువద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమ ప్రాంగణంలో వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రెండు మండలాల వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఏపీ మాస్ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాధ్రి, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడీఏలు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెరగాలి

నంద్యాల: ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనే గర్భిణులు ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి మాతా శిశు మరణాలపై అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తమ పరిధిలోని గర్భిణులను అనుసంధానం చేసుకొని తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు మాతృ మరణాలు, మూడు శిశు మరణాలు చోటు చేసుకున్నాయని భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. ఆస్పత్రుల్లో పరికరాల కొరత ఉంటే ఆరోగ్యశ్రీ లేదా ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి ఏర్పాటు చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటళ్లకు రోగులను తరలించేటప్పుడు సంబంధిత పేషెంట్ ఆరోగ్య పరిస్థితులపై రిఫరల్ హాస్పిటల్ సిబ్బందికి వివరించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

జగనన్న లేఅవుట్లలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 967 గృహాలను ఈనెల 30 తేదీలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన 45,600 గృహాల్లో ఇప్పటి వరకు 8 వేల గృహాలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన 12,967 గృహాలకు గాను 8,316 గృహాలు బిలో బేస్మెంట్ స్థాయిలోనే ఉన్నాయని, మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని చెప్పారు. డోన్, ప్యాపిలి, మహానంది, కొలిమిగుండ్ల, బేతంచెర్ల తదితర మండలాల్లో పురోగతి అతి తక్కువగా ఉందని, ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. జగనన్న లేఅవుట్ల కాలనీల్లో 96 ఆర్చీలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామని, ఇప్పటివరకు ప్రారంభించ లేదని, నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. విజయవాడ నుంచి వచ్చిన హౌసింగ్ ఎస్ఈ వెంకటరెడ్డి, హౌసింగ్ జిల్లా మేనేజర్ భాస్కర్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్

నిర్దేశించిన లక్ష్యాలను సాధించండి

నంద్యాల: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కాలపరిమితి లోపు సాధించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణ, పీఓఎల్ఆర్ రీ సర్వే, చుక్కల భూములు, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర అంశాలపై తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 340సి, 167బి జాతీయ రహదారుల భూములకు సంబంధించి భూ సేకరణ పూర్తయి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత నివేదికలను 24వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో సర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. అన్ని మండలాల్లో పెండింగులో ఉన్న ఫారం 6, 7, 8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దాదాపు 5,170 దరఖాస్తులను వేగంగా, పారదర్శకంగా విచారించి ఈ నెల 21వ తేదీలోగా ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాలు, ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చే యాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కామేశ్వరరావు, వెంకటశివ, ఆర్‌డీఓలు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి